రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద మొక్కలకు నీరు పోస్తున్న డీపీఓ సురేశ్‌కుమార్

హరితహారం మొక్కలను సంరక్షించాలి

● డీపీఓ సురేశ్‌కుమార్

మోతె, ఏప్రిల్ 26 : హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని డీపీఓ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద హరితహారం మొక్కలకు నీరు పోసి మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల మొక్కలు చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా రహదారుల వెంబడి ఉన్న మొక్కలకు నీరుపోసి వాటిని రక్షించుకోవాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానం వైరే మొక్కలు నాటాలని చెప్పారు. గ్రామ పంచాయతీ బోర్లు కాలిపోతే వెంటనే మరమ్మతు చేయించి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రతి గ్రామంలో ఓటర్లకు పోలింగ్ స్లిప్‌లు అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులను ఆర్డీఓ ఎదుట బైండోవర్ చేస్తున్న సీఐ చరమందరాజు

ఆర్డీఓ ఎదుట పలువురి బైండోవర్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ చరమంద రాజు ఆధ్వర్యంలో గరిడేపల్లి మండలం వెల్దండ గ్రామంలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల ప్పుడు ఘర్షణలకు పాల్పడిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వర్గీయులను శుక్రవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. బైండోవర్ అయిన 12 మంది వ్యక్తులపైన సంవత్సరాల కాలంలో కేసు నమోదైతే వారు రూ.2 లక్షల జరిమాన కట్టాలని లేని పక్షంలో జైలు జీవితం గడపాల్సి వస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎన్నికలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి ఆయా తాసీల్దార్ల వద్ద బైండోవర్ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బైండోవర్ ఉల్లంఘించిన వారు నియోజకవర్గంలోని వివిధ స్టేషన్ల పరిధిలోని 11 మంది ఉన్నట్లు,

వారు జరిమాన చెల్లించడంలో నిరక్ష్యం వహిస్తున్నారని, జరిమాన చెల్లించకుంటే వారిని జైలుకు పంపనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

బేతవోలులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిలుకూరు, ఏప్రిల్ 26 : మండలంలోని బేతవోలు గ్రామంలో గల జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో ఓటర్లకు పోలింగ్ స్లిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ ధ్రువకుమార్, ఆర్ఐ సీతయ్య, కార్యదర్శి రామకష్ణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎన్నికల్లో డబ్బుకు ఆశపడితే మోసపోవడం ఖాయం

● జై భారత్ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకన్న

అర్వపల్లి, ఏప్రిల్ 26 : ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపే డబ్బుకు ఆశపడి ఓటు అమ్ముకుంటే మరో ఐదేళ్ల పాటు మోసపోవడం ఖాయమని జై భారత్ జాతీయ ఉపాధ్యక్షుడు ఖుదిజ్ఞాసి గుండు వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానం పోస్టర్‌ను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా పోటీ చేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత వివేచించి మాత్రమే ఎన్నుకోవాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జై భారత్ బీసీ పోరాట వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి దడిపల్లి వెంకట్ పాల్గొన్నారు.

తాసీల్దార్ కార్యాలయానికి బెంచీలు అందజేత

తాసీల్దార్ కార్యాలయంలో రిటైర్డ్ డీటీ భాస్కరాచారి ఏర్పాటు చేసిన బెంచీలు

నూతనకల్, ఏప్రిల్ 26 : తాసీల్దార్ కార్యాయానికి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ తాసీల్దార్ శ్రీపాద భాస్కరాచారి తన తల్లిదండ్రులు వెంకటనారాయణ, అనసూర్య జ్ఞాపకార్థం రెండు సిమెంట్ బెంచీలను శుక్రవారం అందించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు కూర్చోవడానికి బెంచీలు ఎంతగానో ఉపయోగపడుతాయని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీధర్‌నాయక్, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ అప్పారావు

నూతనకల్ : యడవెల్లిలో ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● జడ్పీ సీఈఓ అప్పారావు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 26 : ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతుల వివరాలను వెను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జడ్పీ సీఈఓ అప్పారావు నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. అప్పటికే ధాన్యం కాంటాలు వేసిన బస్తాల్లోని ధాన్యాన్ని, కుప్పలుగా పోసిన ధాన్యం రాశుల మాయిశ్చర్ శాతాన్ని పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే నిర్వహణ సిబ్బంది ఆన్‌లైన్ ప్రక్రియతో పాటు, రైతుల ఖాతాలో త్వరితగతిన డబ్బులు పడేలా నిర్వాహకులు జాగ్రత్త వహించాలన్నారు. అలాగే డ్రైడే సందర్భంగా మొక్కలకు నీటిని అందించి హరితాహారం లక్ష్యాన్ని స్థానిక కాలనీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శిరీష, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏఓ కృష్ణసందీప్, ఏఈఓ మనోజ్, సీసీ చెన్నయ్య పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలు త్వరగా పూర్తి చేయాలి : డీఆర్‌డీఏ పీడీ

నూతనకల్ : ధాన్యం కాంటాలు సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు అన్నారు. మండలంలోని యడవెల్లి, గుండ్లసింగారం, చిల్పకుంట్ల, నూతనకల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం 17 వచ్చేలా చూసుకుని ప్రభుత్వం మద్ధతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కరుణాకర్, ఏఓ మురళి, సీసీ ముత్తయ్య, ఏఈఓ జానయ్యగౌడ్ పాల్గొన్నారు.

బావిలో ఈతకు వెళ్లి యువకుడి మృతి

మఠంపల్లి, ఏప్రిల్ 26 : స్నేహితుడి పెండ్లికి వచ్చి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు బావిలో మునిగి చనిపోయాడు. ఈ ఘటన మండలంలోని అల్లీపురం గ్రామ పరిధిలో శుక్రవారం జరిగింది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన అకిరానందన్ (22) తన స్నేహితులతో కలిసి అల్లీపురం గ్రామంలో ఓ వివాహానికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో ఫ్రెండ్స్‌తో కలిసి ఈతకు వెళ్లాడు. ఈత కొట్టే క్రమంలో అకిరానందన్ నీట మునిగినట్లు స్నేహితులు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు.

స్థానికుల సహాయంతో బంధువులు బావిలో గాలింపు చర్యలు చేపట్టి యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు.

జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన రైతులు

సమస్యల పరిష్కారానికి హమాలీల మెరుపు సమ్మె

● సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో నిలిచిన కాంటాలు

● కాంటాలు వేయాలని కోరుతూ జాతీయ రహదారిపై రైతుల ధర్నా

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 26 : ఎన్నిమార్లు విన్నవించినా తమ సమస్యలు పరిష్కరించడం లేదని పేర్కొంటూ హమాలీలు శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కాంటాలను నిలిపివేసి మెరుపు సమ్మెకు దిగారు. సూర్యాపేట మార్కెట్‌కు రోజూ 30 నుంచి 35 వేల బస్తాల ధాన్యం వస్తుండగా అధికారులు అందరినీ అప్రమత్తం చేస్తూ కాంటాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం అధికంగా వచ్చిన ధాన్యం ఎగుమతి కాకపోవడంతో గురువారం మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరుపలేదు. శుక్రవారం సైతం మార్కెట్‌కు 30,179 బస్తాల ధాన్యం వచ్చింది. రైతులు తెచ్చిన ధాన్యానికి ధరలు నిర్ణయించిన అనంతరం కాంటాలు వేయాల్సిన హమాలీలు మెరుపు సమ్మెకు దిగారు. కొంత కాలంగా మార్కెట్‌లో వినియోగిస్తున్న సూపర్ బస్తాలతో వేసవికాలంలో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. తక్షణమే ఆ బస్తాల స్థానంలో గతంలో మాదిరిగా గన్నీ బస్తాలు పెట్టాలని అలాగే తమ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయాలని, యూనిఫామ్‌లు ఇవ్వడంతో పాటు ఖరీదుదారులే బస్తాలు, పురుకోసలు తెచ్చివ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఉదయం నుంచి మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే కాంటాలు వేయాలంటూ 65వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. దాంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఆర్డీఓ వేణు మాధవరావు, మార్కెట్ కార్యదర్శి రాహుల్ రైతుల వద్దకు చేరుకుని ఖరీదుదారులు, హమాలీలతో మాట్లాడి శనివారం ఉదయం 6 గంటల వరకు కాంటాలు వేయిస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూర్యాపేట మార్కెట్‌లో హమాలీలు 7 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మార్కెట్ కార్యదర్శి రాహుల్‌కు అందజేసినట్లు వెల్లడించారు. అప్పటికే మార్కెట్‌కు సరుకు రావడం, ఇనామ్‌లో టెండర్ ప్రక్రియ పూర్తి కాగా మార్కెట్ హమాలీలు బస్తాలు నింపడం, కాంటా వేయడం, ట్రేడర్స్‌కు అప్పగించడం మాత్రమే మిగిలి ఉన్నట్లు వెల్లడించారు. శుక్రవారం వేసిన ధరలనే యధావిధిగా ఉంచి రైతులకు నష్టం రాకుండా అందించనున్నట్లు పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

మే డేను విజయవంతం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 26 : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కృష్ణాటాకీస్ ప్రాంతంలో నిర్వహించిన పార్టీ టౌన్-1 కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వర్గంపై అనేక భారాలు మోపుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తుందన్నారు. కార్మికులకు పని గంటలు పెట్టి సంఘం పెట్టుకునే హక్కును కాలరాస్తుందన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఈ ఎన్నికల్లో లౌకిక, ప్రజాస్వామిక పార్టీలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్, దండ వెంకట్‌రెడ్డి, వి.సాయికుమార్, మామిడి పుల్లయ్య, అర్వపల్లి లింగయ్య, మామిడి సుందరయ్య, గండమల్ల బాగ్యమ్మ, పిట్టల రాణి, శశిరేఖ పాల్గొన్నారు.

వైకుంఠాపురంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నేరేడుచర్ల : ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ప్రజలు

నేరేడుచర్ల, ఏప్రిల్ 26 : మండలంలోని వైకుంఠాపురంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామాంజనేయస్వామి పరిహార సహిత, శ్రీతలా(బొడ్రాయి), ముత్యాలమ్మ, దుర్గ, కామాంచమ్మ, కోటమైసమ్మ, పోతురాజు, శిఖర, గణపతి, సుబ్రహ్మణ్యస్వామిని భక్తులు దర్శించుకుని పులకించిపోయారు. సోమప్ప దేవాలయ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, పావని దంపతులు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ముసొడ్డుతండాలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని పులగంబండతండా పంచాయతీ పరిధి ముసొడ్డుతండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులు గ్రామంలో రామాలయం నిర్మాణం చేస్తుండగా ముందుగా ఆంజనేయ విగ్రహాన్ని వేద మంత్రోచ్చరణలతో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిలుకూరు : చిలుకూరు శివారులో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. భక్తులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మఠాదిపతి పమ్మి బ్రహ్మయ్యచారి, విగ్రహ దాతలు పమ్మి పిచ్చయ్య, గురువమ్మ దంపతులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలి

కోదాడ రూరల్ : నేటి నుంచి ప్రారంభమయ్యే పట్టణ బొడ్రాయి బజార్‌లోని కోట మైసమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం పట్టణ ఉత్సవ ప్రచార రథాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, రంగయ్య, వెంకటనారాయణ, సత్యనారాయణ, రవీందర్, రాముడు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీని ఓడించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

కోదాడ రూరల్, ఏప్రిల్ 26 : భారత రాజ్యాంగ పరిరక్షణకు లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మతతత్వ పార్టీలను ఓడించి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను గెలిపించాలని ఆమె కోరారు. బీజేపీ పాలనలో దేశంలో దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు పెరిగినట్లు తెలిపారు. నాటి ఎన్నికల వాగ్దానాల్లో ఏ ఒక్కటి అమలు చేయలేని బీజేపీని ప్రజలు ఓడించాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, ముత్యాలు, ములకలపల్లి రాములు, కుక్కడపు నళిని పాల్గొన్నారు.

మతాల పేరుతో చిచ్చు పెట్టే పార్టీలకు బుద్ధి చెప్పాలి

హుజూర్‌నగర్ : మతాల పేరుతో చిచ్చు పెట్టే పార్టీలకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు మే డే వేడుకల్లో ఐక్యంగా పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, జక్కుల రమేశ్, యల్లావుల రమేశ్, శ్రీనివాస్, రవీందర్, సత్యనారాయణ, కృష్ణ, వెంకటేశ్వర్లు, మల్లయ్య పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకురాలు మల్లు లక్ష్మి

మతోన్మాద బీజేపీని ఓడించాలి

మఠంపల్లి : జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండు నాయక్ అన్నారు. మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుళ్ల పేరుతో పాలన సాగిస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, జగన్‌మోహన్‌రెడ్డి, మేళ్లచెర్వు మండల కార్యదర్శి వట్టెపు సైదులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

● రూ.లక్ష అందించిన బీఆర్ఎస్ నాయకుడు అప్పారావు

రూ.లక్ష అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అప్పారావు

కోదాడ రూరల్, ఏప్రిల్ 26 : మండల పరిధి కాపుగల్లు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బీఆర్ఎస్ నాయకుడు దొంతగాని అప్పారావు తన తల్లిదండ్రులు రాములమ్మ, సత్యనారాయణ జ్ఞాపకార్థం శుక్రవారం రూ.లక్ష విరాళంగా అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలెబోయిన పాపారావు, జయరాజు, చంద్రయ్య, బాడిషా నరసింహారావు, రమేశ్, వెంకటేశ్వర్‌రావు, నరేశ్, రామాలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎద్దుల బండ లాగుడు పోటీలు ప్రారంభం

ఎద్దుల బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఫాదర్ మార్టిన్ పసల, శుభోదయ యూత్ సభ్యులు

మఠంపల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎద్దుల బండ లాగుడు పోటీలను ఫాదర్ మార్టిన్ పసల, అల్లం బాలరెడ్డి, బ్రదర్ వినోద్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ.. పోటీల్లో 11 జతలు ఎద్దులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదూరి మధుసూధన్‌రెడ్డి, బాలరెడ్డి, గాదె లూర్దుమారెడ్డి, బోయపాటి అంథోనిరెడ్డి, గోపు లూర్దుమారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతను మించింది లేదు

● పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి మహాస్వామి

● సంతోషిమాత ఆలయంలో మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

భక్తులను ఉద్దేశించి ప్రవచిస్తున్న విద్యా శంకర భారతి మహాస్వామి

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 26 : ప్రపంచంలో మానసిక ప్రశాంతతను మించింది మరొకటి లేదని పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య మహాస్వామిజీ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన మాట్లాడారు. మనిషి ఆర్థిక, ఆరోగ్య, ఉద్యోగ ఎన్ని రంగాల్లోనైనా తృప్తిగా ఉన్నా మానసిక ప్రశాంతత లేకపోతే ఈ జీవితానికి మనుగడ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పరిపాలిత దేవాలయ ధర్మాధికారి ఎం.ఎల్.ఆర్‌గుప్తా, దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశం గుప్తా, బ్రాహ్మండపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామ్మూర్తి పాల్గొన్నారు.

చెరువు మట్టి అక్రమంగా తరలింపు

నాగారం, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రం పక్కన ఉన్న చెరువు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆక్రమార్కులు కొందరు అక్రమంగా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. కొందరు రైతుల పొలాలకు అని చెప్పి ఇటుకల బట్టీలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిల్లల బరువును పోషణ్ ట్రాక్‌లో నమోదు చేయాలి

నూతనకల్, ఏప్రిల్ 26 : పిల్లల బరువు, ఎత్తు కొలతలు పోషణ్ ట్రాక్‌లో నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులత సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్

గరిడేపల్లి, ఏప్రిల్ 26 : భవన నిర్మాణ కార్మికులకు పనులు సక్రమంగా లేని కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావునా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు సక్రమంగా లేని కారణంగా వారి కుటుంబాలు గడవడమే కష్టతరంగా మారిందన్నారు.

ప్రభుత్వం వారికి పని కల్పించడంతో పాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.